౩

# వేంకటేశ్వర దీపారాధన

ఉరిశిక్ష (capital punishment) ఇవ్వవచ్చునా ఇవ్వ కూడదా అనే సమస్యలో లోకం ఇప్పుడు పడిందికాని, మా యింట్లో హేంగింగు లైటుకు హేంగింగు తీసిపాఱవేసేసి చాలా కాలమైంది. ఆ లైటు—దానికేపోవచ్చి పాడైపోతే అటకమీద పడవేశాం. అటకే దానికి బందీఖోలు.

మనిషికేమిటి వస్తువుకేమిటి, చూడండీ! కొన్నాళ్లకు కర్మ పరిపక్వమైతే, తిరిగి యథాస్థానం అలంకరిస్తుంది. ఆ ప్రకారంగా మా లైటుకు మళ్లీ మంచిరోజులు వచ్చినయి కామోసు, దాన్ని పైకితీసి, జ్వాల—జుంకా తుడిచి సరిచేసి సరంబీకి వ్రేళ్లాడదీద్దామని తలపోసి, వ్రేళ్లాడదీస్తే కాపిటల్ పనిష్మెంటు అయిపోతుందేమో అని ఆలాగ్గానే దాని మొత్త బొట్ట మోపుగా ఓ కన్నాల స్టాండుమీద, కిందనుంచీ పైనుంచీ గాలోసుకొనేలాగు నిలబెట్టి, టేబిల్ మీద పెట్టుకుని పని చూచుకుంటూ వున్నాను.

పనంటే ఏమీ లేదు. నాకొచ్చిన love letters (ప్రణయ లేఖలు) అన్నీ అక్కడదిక్కడ పెట్టి ఇక్కడదక్కడ పెట్టి లైటు హెచ్చించి వెల్తురులో ఎలా కనబడతాయో అని వొక

మాటూ, లైటుతగ్గించి చీకట్లో ఎలా కనబడుతారో అని వొకమాటూ, ఎక్స్పెరిమెంటు చేస్తూవున్నాను. లెటర్సు పాతవైనా ఎక్స్పెరిమెంటు కొత్తదికావచ్చు. ఎక్స్పెరిమెంటుకూడా వొక్కొక్కప్పుడు పాతదైనా ఈ పర్యాయం వచ్చే రిసల్టు కొత్తదికావచ్చు. ఏమంటారు ?

గబుక్కున నాచెయ్యి ఆ టేబిల్ మీదవున్న బొట్టమోపు మొత్తానుడు హేంగింగులైటుకు ఎలా తగిలిందో తగిలింది. మంచి రస కంధాయపట్టు ఏదో చదువుతున్నాకామోసు — "ఓ! ప్రియుడా! నిన్ను బాసియుండడమంటే బహుకష్టంగా వుంది. నీ బాహుపంజరంలోకి అమాంతంగా దుమికేసెయ్యాలనివుంది. కాని నాపాద మంజీరం ధ్వని చేస్తుందేమోనని భయమేస్తూవుంది. ఓ! నా మోసగాడా! నీ కళ్ళల్లో నాకళ్లు పెట్టి చూడాలనివుంది. కాని మన కనుపాపల్లో నీడలు అమాంతంగా పరస్పరం గావులించుకొని మనలను గుడ్డివాళ్లనుగా చేస్తాయేమోనని సంకోచంగావుంది. ఓ! సింహోరస్తుడా! నీ హృదయంలోకి, నీ వతౌని కపాయంలేకుండా నాకు చొరుచుకు పోవాలనివుంది. కాని వెనకాలనుంచా ముందునుంచా అనే మీమాంస ఎంతకీ తెగడంలేదు—"అని అలాగ్గా అంత ఇదిగావున్న ఒకానొక ప్రణయలేఖ చదువుతూ వున్నానేమో, బహూమూవ్ చేసింది. పూర్వోక్తప్రకారంగా నాచెయి తగిలింది. దేనికీ? ఆ బొట్టమోపు మొత్తానుదు, వెలుగుతూవున్న హేంగింగులైటుకు.

తగిలిన పాళంగా టేబిల్ మీదవున్న లైటు, టేబిల్ మీదనే అమాంతంగా బోల్తాకొట్టి చమురుకక్కి జ్వాలాతోరణంలా అయిపోయింది. చిమ్నీ ఊడిపడింది. జ్వాలేఆపడమో చిమ్నీనే కాపాడ్డమో రెండూ తెలియక—"రా! రా! తగులడిపోయినాయి ఇవన్నీని ఈ ప్రణయలేఖలన్నీని" అన్నాను, అప్రయత్నంగా. అంటూనేవున్నాను! గదిఅంతా చీకటిమయం అయిపోయింది. ఆచీకట్లో బుడ్డిదీపం పుచ్చుకొని, అంటే బుడ్డిదీపం అన్నమాట అదే కెరొసీను లైటు, అదుచ్చుకొని తయారైంది మా ఆవిడ తాయారమ్మగారు.

"ఏమిటి గొడవ?" అంటుంది. "ఏముంది? నిప్పూ నేనూ యీ యీ వత్తుప్రపంచం పరశురామప్రీతి అయి యుండిపోవలసింది. ఓగడియక్రిందట" అన్నాను. "మరి కాలేదేం?" అంది శాంతంగా ఆవ్యక్తి. "కాలేదు. నీపుణ్యవశాత్ కాలేదు." అని అక్కణ్ణుంచి వేదాంతంలో పడ్డాను, ఆవిడతోటి ప్రసంగిస్తూ. "చూడూ! ఇలాంటివే నేవ్ మహాప్రళయాలు అన్నా మహాప్రళయాలు దాటుకుపోవడమన్నాను!—నిజంగా నీవు చూళ్లేదుగాని మన హేంగింగు లైటు ఇప్పుడు గుప్పుమనడం, బ్రహ్మాండంగా మండిపోయింది ఈ టేబిల్ మీద—ఈ కాయితాలన్నీ నుసిఅయిపోయినాయే అనుకొన్నాను. కాని దేవుని అపారమైన కృపవల్ల కాలేదు, ఏదీ? వొక్క దివ్యోపాసన కానియ్యి, ఆ పరాత్పరుడికి మన కృతజ్ఞత తెలపాలి" అన్నాను.

అనేసరికి తారాజువ్వలాగు లేచింది. ఆ బుడ్డిదీపం అక్కడ పెట్టింది. "మళ్లీ తీశేరూ ఆ పాత్ర కాగితాలు! మీ పనియా

లేఖలు! ఇలాఇవ్వండి, అవి ఇలాఇవ్వండి అవి—"ఇవి మీదగ్గ ఉన్నన్నాళ్ళూ, దీపాలూ పడగొడతారు, దెయ్యాల్నీ విడగొడతారు, ఇలాఇవ్వండి! ఇమ్మనమంటే? ఇప్పటికైనా ఇవ్వరేం? " అని నా చేతుల్లోనున్న లేఖలన్నీ ఊళ్లాక్కుని ఇంతింత ముక్కలుగా చించి గిరాటేసింది. వీధిలోకి విసిరేసింది.

"ఎవరైనా తెల్లారితే అంటించి చదువుతారేమో!" అన్నాను. అనేసరికి తానేస్వయంగా అవతలకువెళ్లి బుడ్డెడు చమురూ ఆ చింపిన ముక్కలమీదపోసి అగ్గిపుల్లట్టుకొచ్చి అంటించి, జ్వాలచేసి "ఇక నిదరోండి!" అంది.

చెప్పొద్దూ! నా హృదయం మహావేదన పడిపోయింది. అలా ఆ నా ప్రణయలేఖలు తగులడిపోతూవుంటే కాని ఓ విజయం! ఏతాయిలంగారు ఆ లేఖలు వ్రాసినారో, నా తాయారమ్మకు తెలియకుండా అవి తగులడిపోవడమే నాక్కావలసిందిఅల్లా!

ఆ ముక్కనేసరికి మొగమ్ముణిచిపెట్టుకొని—నా తాయారమ్మ మొగమ్ముణిచి పెట్టుకొని—"లోకమా! నవ్వు! లోకమా! ఏడువు! లోకమా! చావు!" అని శోకటే విజృంభణ, క్షణక్షణ... ...

ఆ విజృంభణ ఎప్పుడు ఆగింది? వేంకటేశ్వర దీపారాధన మొక్కు లోలో నేను మొక్కుకుని, అసలు తాయారమ్మకు మొక్కి, వడ్డితాయారమ్మకు మొక్కితేనేగాని ఆగలే!

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 10-11-1986 | నరసాపురము | "వినోదిని"లో |